
సాక్షి
జగిత్యాల
మంగళవారం । 31 । డిసెంబర్ । 2024



ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా విడుదల

ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం విడుదల చేసింది. కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల పట్టభద్రుల ఓటర్లు, ఉపాధ్యాయ ఓటర్ల తుది జాబితా ప్రకటించింది. - 8లో▸



అటవీ ప్రాంతం..చిరుత భయం

మెట్‌పల్లి మండలం రంగారావుపేట శివారులో చిరుత పులి మరోసారి సంచరించిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.0/18.0

పొడి వాతావరణం ఉంటుంది. ఉదయం దట్టమైన పొగమంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఎండవేడిగా ఉంటుంది. సాయంత్రం చలిగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

ఫిర్యాదుదారులకు సత్వర సేవలందించాలి



పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాలక్రైం: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు సత్వర సేవలందించాలని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. జిల్లాకేంద్రంలోని పట్టణ పోలీస్‌స్టేషన్‌ను సోమవారం తనిఖీ చేశారు. పరిసరాలు, రికార్డులు పరిశీలించారు. బాధితులు నేరుగా పోలీస్‌స్టేషన్‌లోనే సంప్రదించాలన్నారు. పెట్రోకార్, బ్లూకోల్ట్స్ సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలన్నారు. నూతన టెక్నాలజీతో కేసులు ఛేదించాలన్నారు. వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పోలీస్‌స్టేషన్‌కు అనుసంధానం చేసేలా ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూంను ప్రారంభించారు. డీఎస్పీ రఘుచందర్, టౌన్ సీఐ వేణుగోపాల్, డీసీఆర్బీ సీఐ శ్రీనివాస్, ఎస్సైలు కిరణ్‌కుమార్, మన్మథరావు, గీత, మల్లేశం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నృసింహుడి హుండీ ఆదాయం రూ. 60.87 లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామికి హుండీల ద్వారా వచ్చిన ఆదాయాన్ని సోమవారం ఆలయ ప్రాంగణంలో లెక్కించారు. రూ.60,87,598 సమకూరినట్లు ఈవో శ్రీనివాస్ తెలిపారు. సెప్టెంబర్ 25 నుంచి ఈనెల 30 వరకు వచ్చిన ఆదాయాన్ని లెక్కించారు. ఇందులో 55 గ్రాముల మిశ్రమ బంగారం, మిశ్రమ వెండి 6.50కిలోలు, 27విదేశీనోట్లు సమకూరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ సహాయ కమిషనర్ సుప్రియ, సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు తదితరులున్నారు.

రోడ్డు భద్రత చర్యలు తీసుకోవాలి



జగిత్యాల: రోడ్డు భద్రత చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆర్‌అండ్‌బీ, ఎన్‌హెచ్–63 అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అధికారులు ప్రమాద స్పాట్లను గుర్తించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. హైవే రోడ్‌లో, ఆర్‌అండ్‌బీ రోడ్లపై ప్రమాదాలు జరగకుండా గుంతలు, ప్రమాదకరంగా ఉన్న బావులను పూడ్చివేయాలని ఆదేశించారు. పట్టణంలో స్ట్రీట్‌లైట్లు, సీసీకెమెరాల స్పాట్లను గుర్తించాలని కమిషనర్‌ను ఆదేశించారు. అదనపు కలెక్టర్ లత, ఎస్పీ అశోక్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

జూనియర్ అసిస్టెంట్ల నియామకం

జగిత్యాల: టీజీ పీఎస్సీ ద్వారా గ్రూప్–4 సర్వీస్ కింద రెవెన్యూ శాఖలో ఎంపికైన జూనియర్ అసిస్టెంట్లకు నియామక పత్రాలను కలెక్టర్ సత్యప్రసాద్ అందించారు. జిల్లా 21 మంది జూనియర్ అసిస్టెంట్లు వచ్చారని, వారందరికీ పోస్టింగ్‌లు ఇచ్చామని పేర్కొన్నారు. నియామకం అయినవారంతా ఆయా రెవెన్యూ కార్యాలయాల్లో రిపోర్ట్ చేయాలని సూచించారు.

ఒంటి కాలిపై నిల్చుని ఎస్‌ఎస్‌ఏల నిరసన



నిరసన తెలుపుతున్నఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు

జగిత్యాలటౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు సోమవారం ఒంటికాలిపై నిల్చుని నిరసన వ్యక్తం చేశారు. తమ సర్వీసును క్రమబద్ధీకరించి విద్యాశాఖలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూల దృక్పథంతో పరిష్కరించాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించి విద్యా శాఖలో విలీనం చేయాలన్నారు. ప్రభుత్వం దిగివచ్చి తమ డిమాండ్లు పరిష్కరించకుంటే ఉద్యమాన్ని మరింత తీవ్రం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు బర్ల నారాయణ, శ్రీనివాస్, ఉద్యోగులు పాల్గొన్నారు.

చుట్టూ చెరువులే.. నీరంతా కలుషితమే..

- జలవనరుల్లో కలుస్తున్న పట్టణ డ్రైనేజీ నీరు
- పూర్తికాని సివరేజ్ ట్రీట్ ప్లాంట్లు
- అండర్ డ్రైనేజీ లేక అవస్థలు





ముప్పారపు చెరువులో కలుస్తున్న డ్రైనేజీ నీరు

జగిత్యాల: జిల్లాకేంద్రం చుట్టూ ఐదు చెరువులున్నాయి. మోతె, కండ్లపల్లి, లింగం, ముప్పారపు, చింతకుంట చెరువులుగా పిలుస్తారు. అయితే జగిత్యాలలో అండర్ డ్రైనేజీ సిస్టమ్ లేకపోవడంతో వృథా నీరంతా ఈ చెరువుల్లోకే చేరుతోంది. ఫలితంగా నీరు మొత్తం కలుషితం అవుతోంది. ఈ ఐదు చెరువుల నుంచే పట్టణ ప్రజలకు అవసరమైన నీటిని సరఫరా చేస్తున్నారు. పైగా మత్స్యకారులు ఈ చెరువులపైనే ఆధారపడి జీవిస్తున్నారు. నీరు పూర్తిగా కలుషితం కావడంతో వాటిని వేటికీ ఉపయోగించుకోవడం లేదు. సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు లేకపోవడం ఇబ్బందిగా మారింది. ప్రస్తుతం జగిత్యాలలో 48వార్డులు ఉన్నాయి. ప్రతి వార్డుల నుంచి వెలువడే డ్రైనేజీ నీరు పట్టణానికి చుట్టూరా ఉన్న ఈ చెరువుల్లోకే చేరుతుంది. దీంతో అందులో మత్స్యకారులు పెంచుతున్న చేపలు తినడంతో కొన్నిసార్లు మృత్యువాత పడుతున్నాయి. ఈ చెరువుల్లో పెంచుతున్న చేపలనే జగిత్యాలలో అమ్ముతుంటారు. ఐదు పెద్ద చెరువులే కావడం.. అందులో లక్షలాది చేపలు పెంచుతూ మత్స్యకారులు జీవనాధారం పొందుతున్నారు. అయితే డ్రైనేజీ నీటి కారణంగా చేపల వ్యాపారం తగ్గుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలుషిత నీరు చేరే ప్రాంతాల్లో సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తే మేలంటున్నారు స్థానికులు.

సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఎప్పుడో..?

మురికినీటిని శుభ్రం చేసేందుకు చెరువుల వద్దగానీ, ఎక్కడ అవసరం ఉంటే అక్కడ సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేస్తుంటారు. అయితే జిల్లాకేంద్రమైనా ఎక్కడా ఈ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు లేవు. ఇటీవల ఆస్పత్రిలో ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. అలాగే చెరువుల వద్ద అవసరమున్న చోట్ల డ్రైనేజీ నీటిని శుద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలని పట్టణప్రజలు కోరుతున్నారు.

ఆక్రమణలు అధికం

చెరువుల్లోకి వెళ్లే డ్రైనేజీ కాలువలు కూడా సక్రమంగా లేవు. ఎక్కడపడితే అక్కడ మురికినీరు నిలిచిపోతోంది. మరోవైపు చెరువుల సమీపంలో ఉన్న భూములు రేట్లు అమాంతం పెరగడం.. రూ.కోట్లు పలుకుతుండడంతో ఆక్రమణలు కూడా అధికమవుతున్నాయి. బఫర్‌జోన్ సమీపంలో ఉన్న భూములను ఆక్రమిస్తూ నిర్మాణాలు చేపడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రం పట్టించుకోవడం లేదు.

ముందుకు కదలని అండర్ డ్రైనేజీ వ్యవస్థ

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నాలుగేళ్ల క్రితం జిల్లా కేంద్రంలో అండర్ డ్రైనేజీ ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించారు. కానీ ఆ ప్రణాళిక పట్టాలు ఎక్కలేదు. ఇది చుట్టూరా ఉన్న చెరువులకు శాపంగా మారింది. శివారు ప్రాంతాల్లో అత్యధికంగా ఇళ్లు వెలుస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో డ్రైనేజీలు నిర్మిస్తున్నా ఆ నీరు ఎక్కడికి పోతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

అడుగుముందుకు పడేనా..?

పట్టణంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని ఎంపీ అర్వింద్, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఇటీవలే కలిసి విజ్ఞప్తి చేశారు. అమృత్–2 ప్లాన్ కింద ప్రతిపాదించి స్వచ్ఛభారత్ అభియాన్ కింద ఎస్టీపీ ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీపై స్థానికులు ఆశలు పెట్టుకుంటున్నారు.

ప్లాంట్ ఏర్పాటు చేసేలా చూస్తాం



ప్రస్తుతం సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు లేవు. ఏర్పాటు చేసేలా ప్రయత్నం చేస్తాం. అండర్ డ్రైనేజీ సిస్టం ఉండాలి. అప్పుడు వీటిని ఏర్పాటు చేయవచ్చు. డ్రైనేజీలు సక్రమంగా లేకపోవడంతో చెరువుల్లోకి వెళ్తున్నాయి. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. – చిరంజీవి, మున్సిపల్ కమిషనర్



ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ



ధర్మపురి: ధర్మపురి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం సాయంత్రం మహా పడిపూజ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన మొదటి మహాపడి పూజకు నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి అయ్యప్ప భక్తులు, కాంగ్రెస్ నాయకులు భారీగా తరలివచ్చారు. గురుస్వాములు పెండాల బాలకృష్ణ, గూడెం అయ్యప్పస్వామి ఆలయ గురుస్వాములు పురుషోత్తమచారి మంత్రోచ్ఛరణల మధ్య గణపతి, సుబ్రహ్మణ్య స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాలతో అభిషేకం చేశారు. అయ్యప్ప స్వాములు, భక్తులకు అల్పాహారం అందించారు. పడి పూజ కార్యక్రమానికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ హాజరయ్యారు.

హిందువులంతా ఏకం కావాలి



మాట్లాడుతున్న సువర్ణదేవి

ధర్మపురి: దేశంలోని ఈశాన్య రాష్ట్రాల్లో మతమార్పిడి పెరిగిపోతోందని, దీంతో హిందూ మహిళలు ఇబ్బంది పడుతున్నారని, వాటిని తిప్పి కొట్టడానికి హిందువులంతా ఏకం కావాలని దక్షిణ అసోం ప్రాంత ప్రచారిక్ అఖిల భారతీయ సహసేవ ప్రముఖ్ సువర్ణదేవి పిలుపునిచ్చారు. ధర్మపురి నృసింహుడిని సోమవారం దర్శించుకున్న అనంతరం మాట్లాడారు. హిందువులపై జరుగుతున్న దాడులు, హత్యాచారాలు ఎదుర్కొనే సమయం ఆసన్నమైందని, అందరం కలిసికట్టుగా పోరాడాలని సూచించారు. ఆమె వెంట రాష్ట్ర సేవాసమితి తెలంగాణ ప్రాంత సంపర్క్ ప్రముఖ్ సింధూదిది, జిల్లా సంపర్క్ ప్రముఖ్ కవోస్త నాయకులు పిల్లి శ్రీనివాస్, గాజు భాస్కర్, సంఘీ మంజుల తదితరులున్నారు.

మళ్లీ అదే నిర్లక్ష్యం..

- ఒకరి ఆక్సిజన్ సిలిండర్ మరొకరికి..
- ఆస్పత్రిలో తాజాగా మరో ఘటన



అంబులెన్స్‌లో ఉన్న పేషెంట్‌కు ఆక్సిజన్ పెట్టేందుకు సిలిండర్ తీసుకెళ్తున్న ఆస్పత్రి సిబ్బంది

జగిత్యాల: ఎన్ని సంఘటనలు జరుగుతున్నా.. ప్రజలు నరకయాతన పడుతున్నా.. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది తీరు మాత్రం మారడం లేదు. ఇటీవల ఓ వృద్ధుడు చికిత్స పొందుతుండగా.. ఆయనకు తోడుగా ఉన్న భార్య అనారోగ్యం పాలైంది. ఆమెను అక్కున చేర్చుకుని వైద్యం అందించాల్సిన సిబ్బంది మానవత్వం లేకుండా ఆస్పత్రి బయట పడుకోబెట్టారు. దీనిపై విమర్శలు రావడంతో వెంటనే ఆస్పత్రిలోకి చేర్చుకుని చికిత్స అందించారు. ఆ ఘటన మరువకముందే ఆస్పత్రిలో ఒకరి ఆక్సిజన్‌ను మరొకరికి పెట్టి తమ నిర్లక్ష్యాన్ని మరోమారు చాటుకున్నారు సిబ్బంది.

ఒకరి ఆక్సిజన్ మరొకరికి..

జిల్లా కేంద్రంలోని గోవిందుపల్లికి చెందిన పోచవ్వ అనే వృద్ధురాలు అనారోగ్యంతో ఆస్పత్రికి చేరింది. ఆమెకు శ్వాసకోశ ఇబ్బందులు ఉండటంతో ఆక్సిజన్ పెట్టారు. సారంగాపూర్ మండలం అర్పపల్లికి చెందిన సుమలత అనారోగ్యానికి గురికాగా బంధువులు ఆమెను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి అంబులెన్స్‌లో తీసుకొచ్చారు. ఆమె ఆరోగ్యం క్రిటికల్‌గా ఉండటంతో ఆక్సిజన్ పెట్టాలని వైద్యులు సూచించారు. అయితే ఆక్సిజన్ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయో..? లేవో..? గాని దాదాపు 15 నిమిషాల పాటు గడిపారు. అనంతరం అక్కడ చికిత్స పొందుతున్న పోచవ్వకు చెందిన ఆక్సిజన్‌ను తొలగించి సుమలతకు పెట్టారు. అప్పటికే క్రిటికల్ పరిస్థితికి చేరుకున్న సుమలత చనిపోయింది. అయితే ఆక్సిజన్ సకాలంలో అందకనే చనిపోయినట్లు ఆమె బంధువుల ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు పోచవ్వకు పెట్టిన ఆక్సిజన్ సిలిండర్ తొలగించి సుమలతకు పెట్టడంపైనా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒకవేళ పోచవ్వకు ఏమైనా జరిగి ఉంటే ఎలా..? అని ఆమె బంధువులు ప్రశ్నిస్తున్నారు. ఆస్పత్రిలో సిలిండర్ల కొరత లేదని, ప్లాంట్ కూడా ఈ మధ్యే బాగైందని వైద్యాధికారులు ప్రకటించారు. అదే సమయంలో ఇలాంటి సంఘటన జరగడం విమర్శలకు తావిస్తోంది. ఈ విషయమై ఆర్‌ఎంవో నవీన్‌ను వివరణ కోరగా.. 'ఏదైనా సీరియస్ పేషెంట్స్ వచ్చినప్పుడు అందుబాటులో ఉన్న సిలిండర్ పెట్టే అవకాశం ఉంది. ఒకవేళ అక్కడ ఉన్న రోగికి సిలిండర్ అత్యంత అవసరం లేకపోతే దానిని పరిశీలించి తీయడం మామూలే.



చికిత్స పొందుతున్న వృద్ధురాలి ఆక్సిజన్ తొలగిస్తున్న ఆస్పత్రి సిబ్బంది

వచ్చిన పేషెంట్ చనిపోయే స్థితిలో ఉండటంతోనే సిలిండర్ పెట్టినట్లు తెలిసింది. అందులో నిర్లక్ష్యమేమీ లేదు. ఆక్సిజన్ సిలిండర్లు, ప్లాంట్ పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయి..' అని పేర్కొన్నారు.

తరలివచ్చిన బాధితులు

- అర్జీలు స్వీకరించిన కలెక్టర్
- 32 దరఖాస్తులు రాక
- సమస్యల పరిష్కారానికి ఆదేశాలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాలటౌన్: కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో బాధితుల నుంచి కలెక్టర్ సత్యప్రసాద్ అర్జీలు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వివిధ సమస్యలపై 32 ఫిర్యాదులు వచ్చాయి. వాటిని పరిశీలించిన అనంతరం కలెక్టర్ మాట్లాడారు. ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్లు బీఎస్.లత, గౌతం రెడ్డి, జగిత్యాల, కోరుట్ల ఆర్డీవోలు పులి మధుసూదన్‌గౌడ్, జివాకర్‌రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బతికెపల్లిని మండలం చేయండి



పెగడపల్లి మండలంలో మేజర్ గ్రామపంచాయతీ బతికెపల్లి ఉంది. ఆ గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలి. ఈ గ్రామంలో 8వేల జనాభా ఉంది. రెండు ఎంపీటీసీ స్థానాలతో విస్తరించి ఉంది. దీనికి అనుబంధంగా పుల్లయ్యపల్లి, కొండయ్యపల్లి గ్రామాలు కూడా ఉన్నాయి. మౌలిక వసతులు, జనాభాను ప్రాతిపదికన తీసుకుని బతికెపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయండి.
– బతికెపల్లి మండల సాధన సమితి సభ్యులు

నకిలీ, కల్తీకి అడ్డుకట్ట వేయండి



జిల్లా వ్యాప్తంగా మూడు నెలల వ్యవధిలో పలు హోటళ్లు, కిరాణషాపుల్లో నకిలీ ఆహార పదార్థాలను అధికారులు గుర్తించారు. హోటళ్లలో కుళ్లిన, బల్లిపడిన, ఫంగస్ వచ్చిన ఆహార పదార్థాలు వడ్డించడం.. కిరాణ షాపుల్లో నకిలీ, కాలం చెల్లిన వస్తువుల విక్రయాలతో ప్రజారోగ్యం దెబ్బతింటోంది. కల్తీ పాల విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. నామమాత్రంగా తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు హోటళ్లను సీజ్ చేస్తున్నట్లు ప్రకటిస్తున్నారు. మరుసటి రోజు ఆ హోటళ్లు యధావిధిగా తెరుచుకుంటున్నాయి. విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుని ప్రజారోగ్యాన్ని కాపాడండి.
– ఎన్‌హెచ్ఆర్సీ ప్రతినిధులు

ఎంపీటీసీ స్థానంగా ప్రకటించండి



బుగ్గారం మండలంలోని చిన్నాపూర్, చందయ్యపల్లె గ్రామాలను కలిపి ప్రత్యేక ఎంపీటీసీ స్థానంగా ఏర్పాటు చేయండి. ప్రస్తుతం బుగ్గారం, చిన్నాపూర్, చందయ్యపల్లి కలిపి బుగ్గారం ఎంపీటీసీ (మండల ప్రాదేశిక నియోజకవర్గం)గా ఉంది. బుగ్గారం మండలకేంద్రం కావడం, జనాభా పెరగడం.. చందయ్యపల్లి, చిన్నాపూర్ గ్రామాలకు మూడు కిలోమీటర్ల దూరంలో ఉండటంతో ఆ రెండు గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో చిన్నాపూర్, చందయ్యపల్లె గ్రామాలతో ఒక ఎంపీటీసీ స్థానంగా ప్రకటించండి.
చందయ్యపల్లె గ్రామస్తులు

అంధత్వ పింఛన్ ఇప్పించండి



అంతుచిక్కని వ్యాధితో కంటిచూపు పూర్తిగా కోల్పోయాను. నాకు అంధత్వ పింఛన్ ఇచ్చి ఆదుకోండి. నాలుగేళ్ల నుంచి కొద్దికొద్దిగా మందగించిన కంటి చూపు ఇప్పుడు పూర్తిగా కోల్పోయాను. అధికారులు వందశాతం అంధత్వం ఉందని సదరం సర్టిఫికెట్ ఇచ్చారు. చూపు కోల్పోయి ఏపని చేయలేకపోవడంతో నా భార్య నన్ను వదిలేసి పుట్టింటికి వెళ్లిపోయింది. ఎలాంటి ఆధారమూ లేని నాకు పింఛన్ ఇప్పించండి.– ఎట్టెం జైపాల్, మైతాపూర్, రాయికల్ మండలం

జగిత్యాలను కార్పొరేషన్ చేయండి



రెండు లక్షల జనాభా, 48వార్డులతో స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా ఉన్న జగిత్యాలను కార్పొరేషన్‌గా ప్రకటించాలి. తద్వారా మరింత అభివృద్ధి చెందుతుంది. యావర్‌రోడ్డు ఇరుకుగా ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా పట్టణాన్ని అభివృద్ధి చేయాలి.
– భారత్ సురక్ష సమితి సభ్యులు


కొడుకు, కోడలు కొడుతున్నారు..



బుక్కెడు బువ్వ పెట్టమని అడిగితే కొడుకు, కోడలు కొడుతున్నారు. నాలుగెకరాల భూమి సంపాదించిన. ఇళ్లు కట్టి పిల్లలకు పెళ్లి చేసిన. అలాంటి నాయకు కొడుకు, కోడలు అన్నం పెట్టడం లేదు. అడిగితే ఇద్దరూ కొడుతున్నారు. భర్త చనిపోయి వృద్ధాప్యంలో ఉన్న నాయకు న్యాయం చేయండి.
– మోకినపెల్లి లచ్చవ్వ, సంకెనపల్లి, వెల్గటూర్ మండలం

కన్నవారిని గెంటేసిన కుమారుడు

- ఆర్డీవోను ఆశ్రయించిన వృద్ధులు
- కుమారుడిపై కేసు నమోదు



ఫిర్యాదు చేస్తున్న వృద్ధులు

జగిత్యాల: పోషించాల్సిన కొడుకులు కన్నవారిని గెంటేయడంతో న్యాయం చేయాలంటూ ఆ వృద్ధులు సోమవారం ఆర్డీవోను ఆశ్రయించారు. గొల్లపల్లి మండల కేంద్రానికి చెందిన జెరిపోతుల అంజయ్య, వజ్రమ్మ దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు. చిన్నకొడుకు శ్రీరాం ప్రస్తుతం నివసిస్తున్న ఇంటిని తన పేరుపై మార్పిడి చేయించుకున్నాడు. అప్పటి నుంచి కనీసం పోషణ ఖర్చు ఇవ్వడం లేదు. దీంతో అంజయ్య, వజ్రమ్మ సీనియర్ సిటిజన్ కమిటీ అధ్యక్షుడు హరి అశోక్ కుమార్‌ను సంప్రదించారు. ఆయన ఆర్డీవో కార్యాలయంలో ఫిర్యాదు చేయించారు. వారి ఫిర్యాదు మేరకు శ్రీరాంపై వయోవృద్ధుల సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఆర్డీవో కార్యాలయం ఏవో తఫజ్జుల్ హుస్సేన్ తెలిపారు.

క్లుప్తంగా

కారు ఢీకొని ఒకరి మృతి



రాజమల్లయ్య (ఫైల్)

కథలాపూర్(వేములవాడ): కారు ఢీకొని కథలాపూర్ మండలం పోతారానికి చెందిన నాగెల్లి రాజమల్లయ్య (55) మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. రాజమల్లయ్య పని నిమిత్తం ఆదివారం కోరుట్లకు బైక్‌పై వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నాడు. దుంపేట శివారుకు చేరుకోగానే వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. రాజమల్లయ్య తలకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కోరుట్లకు అక్కడి నుంచి జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. రాజమల్లయ్యకు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. రాజమల్లయ్య కుమారుడు కేశవ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..

పెగడపల్లి: మండలంలోని బతికపల్లికి చెందిన బొమ్మెన రాజయ్య (46) చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై రవికిరణ్ కథనం ప్రకారం.. రాజయ్య కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మందులు వాడినా నయంకావడం లేదు. దీంతో ఈనెల 29న ఇంట్లో క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడు. రాజయ్య భార్య సత్తవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

విద్యుత్ ఉచ్చు కేసులో ముగురిపై కేసు నమోదు

మెట్‌పల్లిరూరల్: వన్యప్రాణుల బెడద నుంచి పంటను కాపాడుకునేందుకు విద్యుత్ ఉచ్చు బిగించి ఇద్దరి మృతికి కారణమైన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మెట్‌పల్లి మండలం రాజేశ్వర్‌రావుపేట గ్రామానికి చెందిన బైరి లక్ష్మీనర్సయ్య గ్రామ శివారులోని తన పంటపొలంలోకి అడవి పందులు రాకుండా ఉండేందుకు పక్కనే ఉన్న మామిడి తోటలో విద్యుత్ ఉచ్చు ఏర్పాటు చేయించాడు. ఆ ఉచ్చుకు తగిలి ఈ నెల 21న అదే గ్రామానికి చెందిన జంగిటి నవీన్ ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనపై మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఉచ్చు ఏర్పాటు చేసిన చిన్ననర్సయ్యపై కేసు నమోదు చేశారు. కేసు భయంతో చిన్ననర్సయ్య ఆ మరుసటి రోజు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే విద్యుత్ ఉచ్చు ఏర్పాటు వ్యవహారంలో మరికొందరి ప్రమేయం ఉన్నట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. దీంతో వారు లోతుగా విచారణ చేపట్టారు. మరో ముగ్గురి ప్రమేయం ఉన్నట్లు గుర్తించి.. బైరి లక్ష్మీనర్సయ్య, జంగిటి పెద్దనర్సయ్య, ఓ బాలుడిపై కేసు నమోదు చేశారు. సోమవారం లక్ష్మీనర్సయ్య, పెద్దనర్సయ్యను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి రెండు ద్విచక్రవాహనాలను సీజ్ చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

స్వగ్రామం చేరిన కార్మికుడి మృతదేహం



ఎర్రన్న (ఫైల్)

మేడిపల్లి: ఆనెల 16న దుబాయిలోని కుర్సకస్ ప్రాంతంలో జరిగిన బస్సు ప్రమాదంలో చనిపోయిన మేడిపల్లి మండలం దమ్మన్నపేటకు చెందిన శేరు ఎర్రన్న (53) మృతదేహం సోమవారం స్వగ్రామానికి చేరుకుంది. కుటుంబసభ్యులు, గ్రామస్తులు కన్నీటి మధ్య దహన సంస్కారాలు పూర్తి చేశారు. మృతదేహన్ని స్వగ్రామానికి రప్పించేందుకు గల్ఫ్ స్వచ్ఛంద సేవకుడు గుండెల్లి నర్సింహా ప్రత్యేకంగా కృషి చేశారు.

ఎమ్మెల్సీ ఓటర్ల తుది జాబితా విడుదల

- పట్టభద్రుల ఓటర్లు 3,41,313
- ఉపాధ్యాయ ఓటర్లు 25,921
- ఇక ఇదే జాబితాతో ఎన్నికలు
- రెండిట ఓటరు నమోదులో కరీంనగర్ టాప్
- అట్టడుగున జయశంకర్ భూపాలపల్లి

సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం విడుదల చేసింది. కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఓటర్లు, ఉపాధ్యాయ ఓటర్ల తుది జాబితాను ప్రకటించింది. పట్టభద్రుల ఓటర్లు 3,41,313 మంది, థర్డ్ జెండర్లు ముగ్గురు ఉండగా ఉపాధ్యాయ ఓటర్లు 25,921 మంది ఉన్నారని వెల్లడించింది. శాసనమండలి ఎన్నికలకు ఎన్నికల సంఘం యుద్ధప్రతిపాదికన కసరత్తు చేస్తున్న క్రమంలో ఇప్పటికే ఓటరు నమోదుకు అవకాశమిచ్చింది. ఓ సారి గడువును పొడిగించగా ఇక ఇదే జాబితాతో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఓటర్ల సంఖ్య క్రమంలో పట్టభద్రులకు సంబంధించి 499 పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయ ఓటర్లకు 274 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు.

ఓటరు నమోదులో కరీంనగర్ టాప్

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఓటరు నమోదులో కరీంనగర్ అగ్రభాగాన నిలిచింది. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి గానూ 15 జిల్లాలుండగా (జిల్లాల విభజనతో) పట్టభద్రుల ఓటరు నమోదులో కరీంనగర్ జిల్లాలో 69,657 మంది అత్యధిక సంఖ్యలో ఓటరుగా నమోదు కాగా అత్యల్పంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కేవలం 2,420 మంది మాత్రమే ఓటరుగా నమోదు చేసుకోవడం విశేషం. ఉపాధ్యాయ ఓటరు నమోదులో 4,020 మంది ఓటర్లుగా నమోదు చేసుకోగా అతి తక్కువగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి 81మంది మాత్రమే ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. నిజామాబాద్, సిద్దిపేట జిల్లాలు కరీంనగర్ తరువాత స్థానాల్లో నిలువగా ఇతర జిల్లాలో నమోదు అంతంతమాత్రమే. సాధారణ ఓటరు జాబితాలో మహిళల ఆధిక్యం ఉండగా ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో పురుష సంఖ్యకు సగానికి ఉండటం గమనార్హం.

ఉపాధ్యాయుల ఓటర్ల సంఖ్య ఇలా..

జిల్లా	పురుషులు	స్త్రీలు	మొత్తం
కొమురంబీం అసిఫాబాద్	314	143	457
మంచిర్యాల	940	610	1,550
ఆదిలాబాద్	1,073	488	1,561
నిర్మల్	1,263	681	1,944
నిజామాబాద్	2,100	1,429	3,529
కామారెడ్డి	1,341	720	2,061
జగిత్యాల	1,197	509	1,706
పెద్దపల్లి	609	450	1,059
కరీంనగర్	2,512	1,508	4,020
రాజన్న సిరిసిల్ల	633	241	874
సంగారెడ్డి	1,485	1,103	2,588
మెదక్	766	515	1,281
సిద్దిపేట	1,948	1,104	3,052
హనుమకొండ	120	38	158
జయశంకర్ భూపాలపల్లి	63	18	81
మొత్తం	16,364	9,557	25,921

పట్టభద్రుల ఓటర్ల వివరాలిలా..

జిల్లా	పురుషులు	స్త్రీలు	థర్డ్‌జెండర్	మొత్తం
కొమురంభీం ఆసిఫాబాద్	4,106	1,749	0	5,855
మంచిర్యాల	18,882	11,606	0	30,488
ఆదిలాబాద్	10,104	4,482	0	14,586
నిర్మల్	11,271	5,538	0	16,809
నిజామాబాద్	19,368	11,225	0	30,593
కామారెడ్డి	11,228	4,587	1	15,816
జగిత్యాల	21,075	13,206	0	34,281
పెద్దపల్లి	18,430	11,638	1	30,069
కరీంనగర్	41,665	27,992	0	69,657
రాజన్నసిరిసిల్ల	13,290	8,323	1	21,614
సంగారెడ్డి	14,437	6,766	0	21,203
మెదక్	8,533	3420	0	11,953
సిద్దిపేట	20,922	10,624	0	31,546
హనుమకొండ	3,055	1,368	0	4,423
జయశంకర్ భూపాలపల్లి	1,694	726	0	2420
మొత్తం	2,18,060	1,23,250	3	3,41,313



సబ్ జూనియర్స్, కేడెట్ విభాగాల్లో ద్వితీయ చాంపియన్‌గా నిలిచిన మహబూబ్‌నగర్ జట్టు



సబ్ జూనియర్స్ విభాగంలో చాంపియన్‌షిప్, కేడెట్ విభాగంలో తృతీయ చాంపియన్‌గా నిలిచిన కరీంనగర్ జట్టు

జూడో చాంపియన్ కరీంనగర్, ఆదిలాబాద్

- రన్నరప్‌గా నిలిచిన మహబూబ్‌నగర్
- ముగిసిన 9వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్, కేడెట్స్ జూడో పోటీలు



కేడెట్ విభాగంలో చాంపియన్, సబ్ జూనియర్స్ విభాగంలో తృతీయస్థానంలో నిలిచిన ఆదిలాబాద్ జట్టు

కరీంనగర్‌స్పోర్ట్స్: తొమ్మిదో తెలంగాణ రాష్ట్రస్థాయి జూడో బాలబాలికల సబ్ జూనియర్స్ చాంపియన్‌గా కరీంనగర్, కేడెట్ చాంపియన్‌గా ఆదిలాబాద్ జట్లు నిలిచాయి. రెండు రోజులపాటు తెలంగాణ, జిల్లా జూడో సంఘాల ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడాపాఠశాలలో జరిగిన 9వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్, కేడెట్ బాలబాలికల జూడో పోటీలు సోమవారం ముగిశాయి. తెలంగాణవ్యాప్తంగా 20జిల్లాల నుంచి సుమారు 400 మంది క్రీడాకారులు, 100మంది కోచ్‌లు, మేనేజర్లు, రెఫరీలు హాజరయ్యారు. సబ్ జూనియర్స్, కేడెట్ విభాగాల్లో మహబూబ్‌నగర్ జిల్లా ద్వితీయ చాంపియన్‌గా నిలిచింది. సబ్ జూనియర్స్ విభాగంలో ఆదిలాబాద్, కేడెట్ విభాగంలో కరీంనగర్ జిల్లాలు తృతీయ చాంపియన్‌గా నిలిచాయి. రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించిన క్రీడాకారులను తెలంగాణ జట్లకు ఎంపిక చేయనున్నారు. జనవరి 18 నుంచి 21వరకు సబ్ జూనియర్స్, 22 నుంచి 25 వరకు కేడెట్ జాతీయ స్థాయి జూడో పోటీలు పూణెలోని ఛత్రపతి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరుగనున్నట్లు తెలంగాణ జూడో సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. జాతీయపోటీల్లో సత్తా చాటి చాంపియన్‌గా నిలవాలని చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు చిట్టమల్ల శ్రీనివాస్, మానేరు విద్యాసంస్థల అధినేత, తెలంగాణ జూడో సంఘం ఉపాధ్యక్షుడు కడారి అనంతరెడ్డి, సెపెక్‌తక్రా సంఘం అధ్యక్షుడు, యోగా సంఘం ఉపాధ్యక్షుడు కన్నకృష్ణ సూచించారు. అనంతరం విజేతలకు ట్రోఫీలు ప్రదానం చేశారు. జిల్లా ఒలింపిక్ సంఘం ఉపాధ్యక్షుడు తుమ్మల రమేశ్‌రెడ్డి, వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల చైర్మన్ గోవిందవరం కృష్ణ, శాతవాహన లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రాంమోహన్‌రావు, జెఫ్‌ఐ కోశాధికారి కై లాసం యాదవ్, తెలంగాణ ఒలింపిక్ సంఘం సభ్యుడు సిలివేరి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

50మంది నిరుపేద విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



ధర్మపురి: నిరుపేద విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ చేయడం అభినందనీయమని ధర్మపురి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాంనర్సింహారెడ్డి అన్నారు. ధర్మపురికి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేశ్ మండలంలోని పేద విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ కోసం సాయం అందించాలని కోరుతూ ఈ నెల 3న ఫేస్‌బుక్‌లో పోస్టు చేశాడు. స్పందించిన ఎన్నారైలు, ఇతర దాతలు రూ.2.50 లక్షల విరాళాలు సైకిల్ స్టోర్ నిర్వాహకుల బ్యాంక్ ఖాతాకు పంపించారు. దీంతో రమేశ్ 50 సైకిళ్లను కొనుగోలు చేసి సోమవారం న్యూ టీటీడీ కల్యాణ మండపంలో సీఐ చేతులమీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్సై ఉదయ్‌కుమార్, ఎంఈవో సీతామహాలక్ష్మి, ఎల్‌ఐసీ బ్రాంచ్ మేనేజర్ శుభాకర్, శ్రీకృష్ణ స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ ఓగుల అజయ్, హెచ్‌ఎంలు శ్రీనివాస్, వెంకటరమణ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారులు



రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులు

జగిత్యాల: సీఎం కప్ బాక్సింగ్ జిల్లాస్థాయి పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చిన దుగ్యాల రాఘవ్, శ్రీకర్, బాలాజీ, అఖిల్, లోకేశ్వరస్, శివకుమార్, హఫీజ్, మోక్షిత, తేజస్విని, అనిత, స్వరాళి, లక్ష్మీ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈనెల 31 నుంచి జనవరి 3 వరకు హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొనేందుకు వెళ్లారు. వారిని కోచ్ నవీన్, బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మహేందర్, శ్రీనివాస్ అభినందించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



పొన్నం ప్రసాద్ (ఫైల్)

కథలాపూర్(వేములవాడ): కథలాపూర్ మండలం సిరికొండ గ్రామానికి చెందిన రైతు పొన్నం ప్రసాద్(40) అప్పుల బాధతో క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. ప్రసాద్ గతంలో ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లాడు. అక్కడ సరైన పని దొరక్కపోవడంతో స్వగ్రామానికి వచ్చాడు. గల్ఫ్ వెళ్లేందుకు చేసిన అప్పులకు తోడు తనకున్న మూడెకరాల్లో పంటల సాగుకు చేసిన అప్పులు రూ.10లక్షల వరకు పెరిగిపోయాయి. వాటిని ఎలా తార్చాలని నిత్యం మదనపడుతున్నాడు. దీంతో ఈనెల 14న పంట చేను వద్ద క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబసభ్యులు గమనించి చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ప్రసాద్‌కు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. ప్రసాద్ భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ పేర్కొన్నారు.

ఉరేసుకుని విద్యార్థి..

వీణవంక: మండలంలోని బేతిగల్ గ్రామానికి చెందిన గుమ్మడి రిషివర్ధన్(22)అనే విద్యార్థి ఇంట్లో ఉరి వేసుకొని సోమవారం సాయంత్రం ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. గుమ్మడి సృజన్- ఉమ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు రిషివర్ధన్ డిప్లొమా పూర్తి చేసి, కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. తండ్రి సృజన్ జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. కుటుంబసభ్యులు జమ్మికుంటలోని ఓ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం జమ్మికుంటలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. ఎస్సై తోట తిరుపతి మృతదేహాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

బావిలో దూకి ఒకరు..

రాయికల్: రాయికల్ మండలం అల్లీపూర్‌కు చెందిన మద్దెల జలేందర్ (40) జీవితంపై విరక్తి చెంది బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సుధీర్‌రావు సోమవారం తెలిపారు. ధర్మపురి మండలం నేరెళ్ల గ్రామానికి చెందిన జలేందర్ నాలుగేళ్లుగా అల్లీపూర్ గ్రామంలో టైలరింగ్ చేస్తూ ఒంటరిగా జీవిస్తున్నాడు. అతిగా మద్యానికి బానిసై ఒంటరితనాన్ని తట్టుకోలేక జీవితంపై విరక్తి చెంది గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. జలేందర్ అక్క లక్కం గంగవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస వ్యవసాయ కళాశాలలో జనవరి 4న పుట్టగొడుగుల పెంపకంపై యువ రైతులకు శిక్షణ ఇస్తున్నట్లు వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ ఎల్లాగౌడ్ తెలిపారు. మొక్కల తెగుళ్లశాస్త్ర విభాగం, పుట్టగొడుగుల పెంపకం యూనిట్ ఆధ్వర్యంలో శిక్షణ ఉంటుందని, మరింత సమాచారం కోసం 63051 89576, 93463 22845 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జ్వరంతో మహిళా సమాఖ్య అధ్యక్షురాలి మృతి



సుమలత(ఫైల్)

సారంగాపూర్: సారంగాపూర్ మండల జాగృతి మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పెద్ది సుమలత (35) కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో జ్వరంతో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. మండలంలోని అర్పపల్లికి చెందిన సుమలత నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతుండగా జగిత్యాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో కరీనంగర్ తరలించారు. అక్కడి వైద్యులు ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయింది. సుమలత అంత్యక్రియల్లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

కుర్మపల్లిలో జీవితఖైదీ అంత్యక్రియలు



పుల్ల లస్మయ్య మృతదేహం



పోలీసు పహారా మధ్య అంత్యక్రియలు



లస్మయ్య (ఫైల్)

రాయికల్: ఓ కేసులో చర్లపల్లి జైలులో జీవితఖైదు అనుభవిస్తున్న రాయికల్ మండలం కుర్మపల్లికి చెందిన పుల్ల లస్మయ్య (60) ఈనెల 28న బ్రెయిన్‌స్ట్రోక్‌తో మృతిచెందాడు. అతడి అంత్యక్రియలను పోలీసు పహారా మధ్య ఆయన స్వగ్రామం కుర్మపల్లిలో సోమవారం నిర్వహించారు. 2019 జనవరి 19న లస్మయ్య ఆయన భార్య గంగవ్వ, కుమారుడు మహేశ్ భూతగాదా విషయంలో అదే గ్రామానికి చెందిన పుల్ల గంగమల్లయ్య, ఆయన తండ్రి పోచయ్యపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో గంగమల్లయ్యను ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. గంగమల్లయ్య భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు రాయికల్ పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి జగిత్యాల రూరల్ సీఐ రాజేశ్, పోలీసులు కిరణ్‌కుమార్, జి.రామకృష్ణ సాక్ష్యాధారాలు సేకరించారు. నేరం రుజువు కావడంతో లస్మయ్య, మహేశ్, గంగవ్వకు జీవిత ఖైదుతోపాటు, రూ.2 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ తీర్పు ఇచ్చారు. అప్పటి నుంచి వారంతా చర్లపల్లి సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్నారు. ఈ క్రమంలో లస్మయ్య మృతిచెందడంతో ఆయన భార్య గంగవ్వ, కొడుకు మహేశ్‌ను పోలీసు బందోబస్తు మధ్య స్వగ్రామానికి తీసుకువచ్చి అంత్యక్రియలు ముగిసిన అనంతరం తిరిగి జైలుకు తరలించినట్లు ఎస్సై సుధీర్‌రావు తెలిపారు.

అటవీ ప్రాంతం..చిరుత భయం

- రంగారావుపేటలో మరోమారు చిరుత కలకలం?
- కుక్క కళేబరం మాయం
- భయాందోళనలో ప్రజలు



చిరుత సంచరించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం రంగారావుపేట శివారులో చిరుత పులి మరోసారి సంచరించిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామానికి చెందిన సంగెపు రమేశ్ మొక్కజొన్న పంట రక్షణ కోసం కట్టేసిన పెంపుడు కుక్కను శనివారం అర్ధరాత్రి సమయంలో చిరుత పీక్కుతింది. మిగతా కళేబరం అక్కడే ఉంది. విషయాన్ని ఫారెస్ట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారు చిరుత సంచరించిందన్న అనుమానం వ్యక్తం చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అయితే పంటపొలం పక్కన ఆదివారం రాత్రి వరకూ ఉన్న కుక్క కళేబరం సోమవారం కనిపించలేదు. దీంతో అర్ధరాత్రి చిరుత మరోమారు సంచరించి కుక్క కళేబరాన్ని తిన్నట్లు గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీంతో అటవీశాఖ అధికారులు సోమవారం బేస్‌క్యాంప్, అటవీ ప్రాంతంలో గాలించారు.

మేకను పీక్కుతిన్న చిరుత..?

వారం పదిరోజుల క్రితం.. చిరుత రంగారావుపేట పక్కనే ఉన్న తండా అటవీ ప్రాంతంలో ఓ మేకను పీక్కుతిన్నట్లు ఆనవాళ్లు కనిపించినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. పదిరోజుల క్రితం ఆత్మకూర్ శివారులోని అటవీ ప్రాంతం వైపు వెళ్లిన కొందరికీ ఏదో జంతువు సంచరిస్తున్నట్లు కనిపించిందని సమాచారం.అక్కడే చిరుత పాదాలను పోలి ఉన్న ముద్రలు కనిపించడంతో భయాందోళనకు గురైన వారంతా అక్కడి నుంచి వెంటనే వెనుదిరిగారు. చిరుత సంచరిస్తుందేమోనన్న అనుమానాలు వ్యక్తం చేస్తూ.. అటవీ ప్రాంతం వైపు ఎవరూ వెళ్లొద్దని గ్రామస్తులను కూడా అప్రమత్తం చేశారు.

భయాందోళనలో గ్రామస్తులు

చిరుత సంచరిస్తోందన్న విషయంతో రంగారావుపేట, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భయాందోళనకు గురువుతున్నారు. రంగారావుపేటలో అటవీ ప్రాంతం వైపు పొలాలు ఉన్న రైతులు భయంభయంతో పంటపొలాలకు వెళ్తున్నారు. సాయంత్రంలోపే తిరిగి ఇంటికి చేరుకుంటున్నారు. మొన్నటిదాకా ఉదయం 4 లేదా 5 గంటలకే పంటలకు నీళ్లు పారిచ్చేందుకు వెళ్లిన రైతులు, చిరుత భయంతో ఉదయం 8 తర్వాతే పంటపొలాల వద్దకు వెళ్తున్నారు.

అటవీ ప్రాంతంలో అధికారులు..

రంగారావుపేట శివారుప్రాంతంలోని పాదముద్రలు ఉన్న ప్రాంతాన్ని ఫారెస్ట్ అధికారులు సోమవారం పరిశీలించారు. రంగారావుపేట అటవీ, పక్క జిల్లాలోని కమ్మర్‌పల్లి అటవీ ప్రాంతం కలిసే ఉంటాయన్నారు. ఈ ప్రాంతాల్లో చిరుతలు ఉండే అవకాశాలున్నాయని స్పష్టం చేశారు. చిరుత ఎల్లప్పుడు ఒకేచోటు ఉండదని, ఇతర ప్రాంతాలకు వెళ్తుందని గ్రామస్తులకు సూచించారు. అటవీ ప్రాంతం వైపు చిరుత సంచరిస్తున్నట్లు కొన్నిచోట్ల ప్లెక్సీలు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చీకటి పడకముందే తమ ఇళ్లలోకి చేరుకోవాలని తెలిపారు. ఇక్కడి ప్రాంతంలో నిఘా పెడుతామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పద్మారావు, సెక్షన్ ఆఫీసర్ చైతన్యశ్రీ, బీట్ ఆఫీసర్ సత్తర్ పాల్గొన్నారు.

అనాథ శవానికి మున్సిపల్ సిబ్బంది అంత్యక్రియలు

మెట్‌పల్లి: కోరుట్ల మండలంలోని నాగులపేటకు చెందిన రజిత (30) కొంతకాలంగా పట్టణంలో భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె.. చెన్నకేశవనాథ ఆలయ ఆవరణలో ఉన్న కోనేరు వద్ద సోమవారం మృతి చెంది కనిపించింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడకు చేరుకొని మున్సిపల్ సిబ్బంది సహాయంతో స్థానిక శ్మశానవాటికలో అంత్యక్రియలు పూర్తి చేయించారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

జగిత్యాలజోన్: పాత కక్షలను దృష్టిలో పెట్టుకుని ఒకరిని హత్య చేసిన కేసులో నిందితుడికి యావజ్జీవశిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.నీలిమ సోమవారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జంగిలి మల్లికార్జున్ కథనం ప్రకారం.. ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి గ్రామానికి చెందిన బర్లపాటి రాజేశ్వర్ వ్యవసాయం చేసుకుని జీవిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన పల్లె పోశెట్టితో ఓ విషయమై గొడవ జరగగా రాజేశ్వర్‌పై పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టాడు. అప్పటినుంచి ఇద్దరి మధ్య పాత పగలు రగులుతున్నాయి. ఈ క్రమంలో 2021 ఫిబ్రవరి 24న సాయంత్రం రాజేశ్వర్ పనిపై బయటకు వెళ్లాడు. రాత్రి 9 గంటలైనా ఇంటికి రాకపోయేసరికి భార్య, కూతురు వెతికేందుకు వెళ్లారు. అదే సమయంలో రాజేశ్వర్‌ను పోశెట్టితోపాటు ఆయన కుటుంబ సభ్యులు కత్తులతో పొడుస్తూ కనిపించారు. ఇది చూసి కేకలు వేస్తూ పద్మ భర్త వద్దకు వెళ్లగా నిందితులు పారిపోయారు. వెంటనే రాజేశ్వర్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలోనే మృతి చెందాడు. పద్మ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై వెంకట్‌రావు కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ శ్రీను దర్యాప్తు చేశారు. పద్మ ఐదుగురిపై ఫిర్యాదు చేయగా.. పోలీసుల విచారణలో పోశెట్టి మాత్రమే హత్య చేసినట్లు రుజువైంది. దీంతో పోశెట్టిపై మాత్రమే కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ అధికారులు టి.రంజిత్, ఎం.కిరణ్‌కుమార్ సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టడంతో పోశెట్టికి యావజ్జీవశిక్షతోపాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.



పొద్దున రద్దీ ... పగలు ఖాళీ

వేములవాడ: శివుడికి ప్రీతిపాత్రమైన సోమవారం రోజున అమావాస్య రావడంతో రాజన్న దర్శనానికి భక్తులు అంతంతే వచ్చారు. ఉదయం పూట భక్తుల రద్దీ కనిపించినా.. మధ్యాహ్నం తర్వాత ఆలయ ఆవరణ భక్తులు ఖాళీగా దర్శనమిచ్చింది. అయితే సోమవతీ అమావాస్య రోజున స్వామి వారిని దర్శించుకుంటే ఎంతో మోక్షమని అర్చకులు చెబుతున్నారు.

